గంజాయి పంట ధ్వంసం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మత్స్యపురం బంగారమెట్టలో అటవీ ప్రాంతంలో గంజాయి పంటను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై బి.సతీష్ మాట్లాడుతూ, బంగారు మెట్ట గ్రామంలో సాగు చేస్తున్న సుమారు రెండు ఎకరాల గంజాయి పంటను పూర్తిగా ధ్వంసం చేసామని తెలిపారు. గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. వాణిజ్య పంటలను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

మాతా శిశు మరణాలను నియంత్రించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా - అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని పాలకొండ, యం.నిట్టాపుట్టు అంగన్వాడి కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఆయన జి.మాడుగుల ఆరోగ్య కేంద్రంను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ, గర్భిణిలకు సకాలంలో గుర్తించి తనిఖీల నిర్వహించాలన్నారు. కాన్పునకు సిద్ధంగా ఉన్న గర్భిణిలను బర్త్ వెయిటింగ్ హెూమ్‌లలో చేర్పించి సుఖ ప్రసవాలు జరిటేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిహెచ్‌సిలో రోజు వారి సుఖప్రసవాలపై సంతృప్తి వ్యక్తం చేసారు. తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణిలకు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు నిర్వహిస్తున్న పాలకొండ, యం.నిట్టాపుట్టు అంగన్వాడి కేంద్రాలను తనిఖీలు చేశారు. గర్భిణీలకు, శిశువులకు సకాలంలో వ్యాది నిరోధక టీకాలు వేసేందుకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలింతలకు, శిశువులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలపై అంగన్వాడీ, ఆశా కార్యాకర్తలకు అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీటి ద్వారా డయేరియా, డిసెంట్రీ, టైఫాయిడ్, కామెర్లు వ్యాధులు ప్రభలే అవకాసం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిలువ ఉంచిన ఆహార పదార్ధాలు తినరాదని, వేడిగా ఉన్నప్పుడే బుజించాలని తెలిపారు. పరిశుభ్రమైన కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఎ.పి హెల్త్ యాప్ లో పొందుపరుస్తున్న రిపోర్టులను పరిశీలించారు. యం.నిట్టాపుట్టు లో 104 వాహనం ద్వారా నిర్వహించిన హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. రోగులకు అందించిన చికిత్సలను వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. మందులను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యాక్రమంలో వైద్యాధికారులు శశికాంత్, విగ్నేష్, బాలమురళీకృష్ణ, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎన్.ప్రకాశరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యాకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డిఎస్ఓ

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి పాడేరు టౌన్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు వెబ్సైట్లో పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్ ఆదేశించారు. శనివారం పాడేరు మండలం వంతాడపల్లి, పాడేరు-1,2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పంపిణీ జరుగుతున్నప్పటికీ వెబ్సైట్‌లో పెండింగ్ చూపిస్తుండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. విఆర్ఓ, డిజిటల్ సహాయకులు ఎప్పటికప్పుడు సరకుల పంపిణీని పర్యవేక్షించాలన్నారు. పంపిణీ వివరాల నమోదు చేసి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు.

రోడ్డు పక్కన వదిలేసిన డ్రైయినేజీ పూడిక

పూడికతో ఇబ్బందులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని వీధి కాలువలలో పేరుకు పోయిన చెత్త చెదారంను వారం రోజుల క్రితం రోడ్డు పక్కన వేశారు. సుమారు వారం రోజులు గడుస్తున్నా బయటకు తీసిన పూడికను రోడ్డుపైనే వదిలేశారు. దీంతో, రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి చెత్తచెదారాన్ని దూర ప్రాంతానికి తరలించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

సీలేరు నదిపై నిర్మించిన ఫ్లోటింగ్ జెట్టీ ఇదే...

మన్యం కొండ జాతరకు

సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్టీ

ప్రజాశక్తి- మోతుగూడెం

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు గ్రామంలో సీలేరు నది ఒడ్డు నుంచి ఒడిశా పొల్లూరు వరకు సీలేరు నదిపై తొలిసారిగా ఫ్లోటింగ్ జెట్టీ ఏర్పాటు చేశారు. 2021లో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఒడిశా నుంచి పోల్లూరు జలపాతం వద్దకు జాతర చూడడానికి వీలు కుదరలేదు. అప్పుడు బోటులో భక్తులు ఎక్కువగా రావడంతో నది దాటించలేకపోయారు. సమయం కూడా సరిపోలేదు. ఆ సంఘటనను గుర్తుంచుకొని ఒడిశా గవర్నమెంట్ ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి ఈకో టూరిజం ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్నిట్లు మల్కన్‌గిరి డిఎఫ్ఓ ప్రతాప్ కట్టపల్లి, ఒడిశా ఫారెస్ట్ అధికారి దీపక్క సివిలి చెప్పారు. ఈ బ్రిడ్జి మీదకు భక్తులు ఎక్కువ వస్తే ఎలా ఉంటాదో శనివారం పరిశీలించారు. ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జి నిర్మాణాన్ని పనితీరును ఒడిశా అధికారులు ఆంధ్ర అధికారులు పరిశీలించారు. ఈ జాతరను గత 50 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నప్పటికీ ఈ విధమైన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం అప్పలనాయుడు, మోతుగూడెం ఎస్ఐ వాసంశెట్టి సత్తిబాబు, ఏఎస్ఐ పట్టాభి రామయ్య, పంచాయతీ కార్యదర్శి రవి నాయక్, జాతర కమిటీ సభ్యులు శిరగం కామేశ్వరరావు, మల్లికార్జున్, ప్రసాద్, వికాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: తిరుపతి శ్రీసిటీలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా డిఎస్‌డిఓ జి.ప్రశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఉమ్మడి సహకారంతో ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్లమా (సివిల్, అగ్రికల్చర్ మినహాయింపు) డిగ్రీలో బిఎస్‌సి, ఎంపిసి, ఎంపిసిఎస్, ఎంఎస్ సిఎస్ పూర్తి చేసి 26 సంవత్సరాలలోపు వయసు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్: 9491786463 నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్.నంద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలోని రైతులు ప్రస్తుత సీజన్ లో తమ పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరంలో జిల్లాలో రబీ పంట 64467 ఎకరాలలో ఉండగా, ఇప్పటికి 41093 ఎకరాలలో వేసిన పంటల వివరాలు మాత్రమే ఈ-పంటలో నమోదు చేశారని తెలిపారు. ఈనెల 28న తప్పనిసరిగా రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ-పంట నమోదుతో రైతులకు ఉపయోగకరమని ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి రైతు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు ప్రభుత్వం అందించే పంటల బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర, రైతు భరోసా వంటి అన్ని పథకాలు ఈ-పంట నమోదుతోనే వర్తిస్తాయని తెలిపారు. సామాజిక తనిఖీల నిమిత్తం సంబంధిత ఆర్ బికెలలో మార్చి 1న ఈ-కెవైసి రైతుల జాబితాను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

హక్కులు, చట్టాలు ఉల్లంఘిస్తే పోరాటం

టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-జి.మాడుగుల: గిరిజన ప్రాంతంలో హక్కుల్ని, చట్టాల్ని కాలరాస్తే ఊరుకునేది లేదని పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. శనివారం వంతల, సొలభం పంచాయతీలలో మండల అధ్యక్షులు వంతల కొండలరావు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రోడ్లు, డ్రైనేజీలు తదితరివి వేసి అభివృద్ధి చేశారన్నారు. గిరిజనుల పక్షాన పోరాటం చేయడానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సోమల చిట్టిబాబు, సంస్కృతి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు సమిరెడ్డి నాగబ్బాయి, క్లస్టర్ ఇన్చార్జిలు సోమేలి రమణ బాబు, వంజరి చిరంజీవి నాయుడు, పంచాయతీ అధ్యక్షులు వంతల కృష్ణమూర్తి నాయుడు, మాజీ ఎంపిటిసి వంతల కళ్యాణి, వైస్ ఎంపీపీ గేమ్మెలి కొండబాబు, పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న టిడిపి నేతలు

రిమాండ్ ఖైదీ మృతి

అనుమానాలున్నాయంటున్న బంధువులు

ప్రజాశక్తి -అడ్డతీగల : రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అడ్డతీగల మండలం బొడ్లంక గ్రామానికి చెందిన కన్నోజి రాజబాబు శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రిలో మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న రాజబాబును రాజమండ్రి ఆస్పత్రులులో చేర్పించారు. వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందినట్లు హాస్పటల్ వర్గాలు తెలిపినట్లు మృతుడు అన్నయ్య రామకృష్ణ తెలిపారు. రాజబాబు మృతి పట్ల పలు అనుమానాలు ఉన్నాయని రామకృష్ణ, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఒక్కొక్కరి దగ్గర ఒక్కో విధంగా చెబుతున్నారని, వారి మాటలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని మృతుని అన్నయ్య రామకృష్ణ తెలిపారు. రాజబాబు మృతదేహాన్ని రాజమండ్రి హాస్పిటల్‌లో శివపంచినామాకు ఉంచారని సర్పంచ్ బోనం రాఘవ తెలిపారు.

రాజబాబు మృతదేహం

మాట్లాడుతున్న ఏపీ గిరిజన విలేకరుల సంఘం నేతలు

బెదిరింపులకు పాల్పడటం తగదు

- ఎపి గిరిజన విలేకరుల సంఘం నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజన పాత్రికేయులపై అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన విలేకరుల సంఘం డివిజన్ కార్యవర్గం డిమాండ్ చేసింది. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై కథనాలు రాసిన పలువురు గిరిజన పాత్రికేయులపై ఓ గిరిజనేతరుడు అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరింపులకు పాల్పడి బినామీలతో భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు సూర్యారావు, పాడేరు గౌరవ అధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ, గిరిజన పాత్రికేయులపై దాడులకు పాల్పడి, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల అధ్యక్షులు రాజారావు, కోశాధికారి మహేష్, హుకుంపేట అధ్యక్షులు ఆనంద్, కోశాధికారి పండు, సభ్యులు చిట్టిబాబు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తూకాలను పరిశీలిస్తున్న కాఫీ ఇఒ బాలంనాయుడు

తూకాల్లో మోసాలను సహించం

ప్రజాశక్తి -హుకుంపేట: సంతల్లో వ్యాపారులు .బెట్టు కాటాలతో మోసాలకు పాల్పడితే సహించేది లేదని కాఫీ ఈవో టీ.బాలం నాయుడు తెలిపారు. శనివారం వారపు సంతలో పర్యటించారు. గిరిజనులు అమ్మకానికి తెచ్చిన పంటలను పరిశీలించి వ్యాపారస్తులతో మాట్లాడారు. గిరిజనులు పండిస్తున్న పంటలను సరసమైన ధరలకు కొనుగోలు చేయాలని తెలిపారు. కాఫీ పండ్లను పాడేరు ఐటిడిఏ సహకారంతో గిరిజన సహకార సంస్థ ఎకో పల్పింగ్ ద్వారా ప్రతి గ్రామంలో కొనుగోలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాజ్మా చిక్కుళ్ళు కేజీ రూ.100 నుంచి 150, తిప్పలమోడీ రూ.350 నుంచి 400, పసుపు రూ.100 నుంచి 150, చెర్రీ రూ.150 నుంచి 180 వరకు కొనుగోలు చేయాలని తెలిపారు. కాఫీ పండ్లు కేజీ రూ.36, కాపి గుళ్ల రూ. 135 నుంచి 150, పార్చి మెంట్. రూ. 270 నుంచి 300 చొప్పున కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాఫీ లైజన్ వర్కర్ కే వాసు దేవుడు, మత్స్య రాజు, శ్రీను సత్యానందం, ఆర్ సత్యనారాయణ, పి.రమేష్, చిన్నారావు, సన్నిబాబు, బొంజు బాబు, కాపు రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు పలు చట్టాలపై అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రాంబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ దుర్వినియోగం, లైంగిక వేధింపులు, దోపిడీ, చైల్డ్ పోర్నోగ్రఫీ, పెరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పించారు. ఫిర్యాదుల కోసం సిపి సిఎస్ఎం, ఆర్‌జిఆర్ పోర్టల్ గురించి, ఐటి యాక్ట్ కింద శిక్షార్హమైన సెక్షన్ల గురించి తెలియజేశారు. బ్యాడ్‌టచ్, బాల్య వివాహాలపైనా వివరించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు తల్లిదండ్రులు, పెద్దలు, పోలీసులు, జిఎంఎస్‌కెను సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న సిఐ వై.రాంబాబు

వెదురునగరంలో...

మండలంలోని వెదురు నగరం గ్రామంలో ఉన్న విశ్వహిందూ పరిషత్ స్కూల్లో దుశ్చర్తి ఎస్సై లతాశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎంపిలు, ఆర్ఎంపిలు..

అనుమతి లేకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తే చర్యలు : పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని పీఎంపీలు, ఆర్ఎంపీలు ప్రభుత్వ అనుమతులు లేకుండా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే హెచ్చరించారు. శనివారం తన ఛాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ విషయంపై అన్ని మండలాల తహశీల్దార్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అనుమతి పత్రాలు ఉన్నవారు మాత్రమే వివిధ రకాలైన ల్యాబ్‌లు నిర్వహించాలని సూచించారు. లేకుంటే అటువంటి వారిపై కూడా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించినట్లు చెప్పారు. ఆర్ఎంపీలు. పిఎంపీలు మెడికల్ క్యాంపులు నిర్వహించకుండా, అనుమతులు లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్న వాటిపై ఎప్పటికప్పుడు పరివేక్షించాలని రంపచోడవరం ఎడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అనూషను ఆదేశించినట్లు తెలిపారు.

రేఖపల్లి, గొల్లగూడెం నీటి పథకం పునరుద్ధరణ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లి, గొల్లగూడెం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే నీటి పథకాన్ని పునరుద్ధరించారు. ఈ నీటి పథకం విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురికావడంతో గడిచిన ఐదు రోజులుగా పైగ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు నీళ్ళ కోసం నానా అవస్థలు పడ్డారు. ప్రజలు ద్వారా సమస్యను తెలుసుకున్న రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని శనివారం యుద్ధప్రాదిపదికన నీటి పథకం మోటార్‌కు మరమ్మతులు చేయించి సంబంధిత గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తాగినీటి పథకం రిపేరు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు సత్యనారాయణ

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

- 8 కేజీల గంజాయి, రెండు బైక్‌లు, మొబైల్ ఫోన్ స్వాధీనం

- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

ప్రజాశక్తి-కొయ్యూరు

అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను కొయ్యూరు పోలీసులు శనివారం పట్టుకున్నారు. కొయ్యూరు ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం... గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొయ్యూరు సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు, మంప ఎస్ఐలు సిబ్బంది మండలంలోని చీడిపాలెం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. చింతపల్లి మార్గం నుండి కాకరపాడు మీదగా ఏలేశ్వరం వైపు రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు వస్తూ, చీడిపాలెం గ్రామ శివారులో పోలీసులను బైక్‌లను వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు లగేజ్ బ్యాగ్‌ల్లో 8 కేజీల గంజాయిని గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న 8 కేజీల గంజాయిని, వారి ప్రయాణిస్తున్న పల్సర్ బైకు, హోండా లివో బైక్‌ను, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజారావు నలుగురు నిందితులు కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలానికి చెందిన అన్నంనేడి రవిచంద్ర, మట్టా ఆకాష్ రెడ్డి, ములగాటి నాగేంద్ర, దొమ్మేటి అభినవ్‌పై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని నడింపాలెం, చింతలపూడి, గింజర్తి తదితర గ్రామాలలో జనసేన సభ్యత నమోదు సాగిన బుజ్జిబాబు, గోకిరి శ్రీనుబాబు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా చింతలపూడి గ్రామంలో బుజ్జిబాబు, శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రభుత్వాల అవినీతి పాలనను ఎండగడుతూ గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నాయకులు ఇచ్చిన హామీలను మరిచి అన్ని విధాల గిరిజన గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేస్తున్న జనసేన నాయకులు

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

లైంగిక దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: చిన్నారులపై లైంగిక దాడులు పెరిగేందుకు చైల్డ్ ఫోర్నోగ్రఫీ ప్రధాన కారణమని ఎస్ఐలు లక్ష్మణరావు, రంజిత్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో శనివారం పిల్లలపై జరిగే లైంగిక నేరాలు, వివిధ చట్టాలు, శిక్షలు, మహిళ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన అశ్లీల చిత్రాలు చిత్రీకరించినా, చూసినా, ఇంకొకరికి పంపినా, చైల్డ్ ఫోర్నోగ్రఫీ గురించి ఇంటర్నెట్ లో వెతికిన, అప్లోడ్ చేసినా, షేర్ చేసిన జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఒక్కోసారి జైలు శిక్షతో పాటు పెద్ద మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. దీనిపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వెంటనే గుర్తించడం జరుగుతుందని, సిఐడి విభాగం ఇలాంటి వారి వివరాలను గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తుందని పేర్కొన్నారు. మహిళల పట్ల అశ్లీల పదజాలం ప్రయోగించినా, అసభ్యకరమైన సైగలు చేసినా, అనవసరంగా తాకుతూ ఇబ్బంది పెట్టినా, లైంగిక పరమైన చేష్టలతో శారీరకంగా, మానసికంగా ఎలాంటి ఇబ్బంది కలిగించినా, అదే పనిగా చూస్తూ ఇబ్బంది కలిగించినా.. అలాంటి చర్యలన్నింటినీ చట్టం లైంగిక వేధింపులుగానే పరిగణిస్తోందని వివరించారు. పిల్లలకు ఇబ్బందికరంగా అశ్లీల సంబంధమైన పనులు చేయిస్తే పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయాలని, స్టేషన్ కు ఫిర్యాదు చేయడం కుదరకపోతే సిపి/సీఎస్ఎం/ఆర్జిఆర్ ప్రభుత్వ పోర్టల్ లో కంప్లైంట్ చేయొచ్చని తెలిపారు.

జి.మాడుగుల:మండల కేంద్రంలోని కాలేజీలు, బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

భూ సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సర్పంచ్ దాసుబాబు

ప్రజాశక్తి:అరకులోయ రూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ పరిధిలో లింబగూడ, నువ్వుగూడ, కొత్త బిష్టుంగుడ, గడుగుడ, డోలిగుడలో సర్వే చేసి భూ సమస్యను పరిష్కరించి రైతులకు పట్టా పాస్ పుస్తకాలను ఇప్పించాలని అల్లూరి జిల్లా సబ్ కలెక్టర్ అభిషేక్‌కు పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సమస్యలను వివరించారు. గతంలో చంద్రబాబు నాయుడు ఈ పంచాయతీని దత్తత తీసుకున్నప్పుడు సర్వే పూర్తిస్థాయిలో జరగకముందే ప్రభుత్వం మారడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ గ్రామాల్లో సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని కోరారు. భూ సమస్య పరిష్కరించాలని 2017వ సంవత్సరం నుంచి అధికారులకు విన్నవించుకున్నా సరైన స్పందన లేదన్నారు. పాస్ పుస్తకాలు లేక పోండంతో రుణాలను పొందలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అధికారులు త్వరితగతిన సర్వే నిర్వహించి రైతులకు పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని దాసుబాబు కోరారు.

జల విద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపం..

నిలిచిన విద్యుదుత్పాదన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఆంధ్ర- ఒడిశా రాష్ట్రాఉల సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపం తలెత్తడంతో విద్యుత్ ఉత్పాదన పూర్తిగా నిలిచి పోయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు..జల విద్యుత్ కేంద్రంలో టిఫి డ్యామ్ వద్ద ఉన్న సొరంగ మార్గంలో గేటు వి రిగి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో 62 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. ప్రాజెక్టులో ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉండగా ప్రస్తుతం సాంకేతిక లోపం ఏర్పడటంతో నాలుగు జనరేటర్ సాయంతో ప్రస్తుతం 62 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతుందని ప్రాజెక్ట్ ఉద్యోగులు తెలిపారు.దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుండి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.మరమ్మతులు చేపట్టి త్వరితగతిన విద్యుత్ వినియోగంలోకి తీసుకొని వస్తామని ప్రాజెక్టు ఉద్యోగ వర్గాలు తెలిపారు.

పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలోని ప్రధాన నగరాల్లో ఒకటైన విశాఖపట్నంలో శాశ్వత ఆర్ట్స్ గ్యాలరీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈస్ట్రన్ నావెల్ కమాండ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సవన్ అన్నారు. ఆర్ట్ వర్క్స్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో రెండు రోజులపాటు తలపెట్టిన ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో తప్ప కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తుండడం హర్షించదగిన విషయమన్నారు. విశాఖ నగరంలో పేరెన్నికగన్న అనేకమంది చిత్రకారులు ఉన్నారన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడం కోసం శాశ్వత పద్ధతిలో ఆర్ట్స్ గ్యాలరీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ ఆర్ట్ టీచర్ జుమానా మాట్లాడుతూ విశాఖ నగరంలో ఇది 16వ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అన్నారు. ఇక్కడ పెయింటింగ్స్ ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా జరుగుతాయన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటుచేసిన 180 పెయింటింగ్స్‌ను 22 మంది చిత్రకారులు వేశారన్నారు. చిత్రకళను అభివృద్ధి చేయడం కోసం, చిత్రకారులను ప్రోత్సహించడం కోసం ఇటువంటి ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మకానికి పెట్టిన పెయింటింగ్స్‌లో రూ.2 వేలు నుంచి రూ.90 వేల ధర పలికేవీ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు డాక్టర్ సల్మా మెహిదీ, నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

ఎయు విసి అక్రమాలపై ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు విసి ప్రసాద్ రెడ్డి వర్సిటీలో అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా మార్చి మొదటి వారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో కలిసి వచ్చే వివిధ విద్యార్థి, యువజన, అభ్యుదయ సంఘాలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని ఆంధ్రా యూనివర్సిటీ ప్రోగ్రెసివ్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నగరంలోని విద్యావంతులను, మేధావులను, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను కలిసి ప్రసాద్‌రెడ్డి దుర్మార్గాలను వివరిస్తున్నామన్నారు.

గెలిపిస్తే సమస్యలపై ప్రశ్నించి, పోరాడుతా..

ఎన్నికల ప్రచారంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

సీతమ్మధార కెఆర్ఎం పార్కులో ప్రచారం చేస్తున్న రమాప్రభ

గాజువాకలో ప్రచారంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి -గాజువాక : ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై శాసనమండలిలో ఉన్న ఆరుగురు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రశ్నించి పోరాడుతున్నారని, వారికి మరింత మద్దతుగా ఉండాలంటే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కోరారు. ఉత్తరాంధ్ర సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారానికి ప్రశ్నించి, పోరాడే స్వభావం తనకు ఉందని, గెలిస్తే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని భరోసానిచ్చారు. శనివారం గాజువాక పంచవటి టౌన్ షిప్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంతం ఉపాధి, విద్య వైద్యం ఇతర మౌలిక సదుపాయాల్లో వెనుకబడి ఉందన్నారు. 24 లక్షల హెక్టార్ల సాగుభూమిలో 20 శాతానికి కూడా నీటి సదుపాయం లేదన్నారు. విభజన హామీల్లోని ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన వర్సిటీ, సుజల స్రవంతి, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇలా అనేకహామీలను కేంద్రం అమలు చేయకున్నా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి ప్రశ్నించే సత్తా, దమ్ము లేదన్నారు.

ఇక రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ విధానాలు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఏటా జ్యాబ్ కేలండర్ విడుదల, డిఎస్సి ప్రకటన, ఉత్తరాంధ్రలో నిరుద్యోగం, వారం రోజుల్లో సిపిఎస్ రద్దు హామీ ఇలా అన్నింటిలోనూ మడం తిప్పేసిందని విమర్శించారు. జిఒ3ను రద్దు చేసి ఏజెన్సీ గిరిజనుల ఉద్యోగ, ఉపాధి హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాసిందన్నారు. మూడు లక్షల కోట్ల విలువైన ఆస్తులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటుకు ధారాదత్తం చేస్తున్నా, ఉత్తరాంధ్రలోని సహజవనరులను కొల్లగొడుతున్నా ప్రధాన రాజకీయ పార్టీలు ప్రశ్నించే స్థితిలో లేవన్నారు. ఈ నేపథ్యంలో శాసనమండలిలో ప్రజల ప్రయోజనాల కోసం పోరాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మద్దతు కోసం పిడిఎఫ్ అభ్యర్థినైన తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారరు. తనకు 250 ప్రజాసంఘాల మద్దతు ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా తాను విజయం సాధించలేని పక్షంలో మేథావులు, పట్టభద్రులంతా తమవైపు ఉన్నారన్న ప్రధాన పార్టీల భ్రమలను నిజం చేసినట్లవుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో పంచివటే టౌన్ షిప్ అసోసియేషన్ అధ్యక్షులు చిన్నారావు, అసోసియేషన్ సభ్యులు, సిఐటియు నాయకులుఎం రాంబాబు, ఎ.లోకేశ్వరరావు, వనమాడ అప్పలరాజు, దాసరి అప్పారావు, సుబ్బన్న, ఎ. కోటేశ్వరరావు పాల్గొన్నారు., అక్కడి నుండి తర్వాత అక్కిరెడ్డిపాలెం, విశాఖ డెయిరీ కాలనీ, సింగపూర్ కాలనీల్లో రమాప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎంవిపీ కాలనీలో...

ఎంవిపి.కాలనీ : సీతమ్మధార కెఆర్ఎం పార్కులో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శనివారం ఉదయం ప్రచారం చేపట్టారు. పార్కుకు వచ్చిన వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మనవి చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్యం చేసిన అధికార, ప్రతిపక్ష పార్టీలకు పట్టభద్రులు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార క్యాంపెయిన్‌లో సిఐటియు సీనియర్ నాయకులు జిఎస్.రాజేశ్వరరావు, జివిఎన్.చలపతి, ఎం.శివనాగేశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ఆర్‌టిసి హైర్‌బస్ యూనియన్ అధ్యక్షులు కెజె.అప్పారావు, ఐద్వా జోన్ కార్యదర్శి కె.కుమారి, వార్వా నాయకులు ఎం.ప్రదీప్ పాల్గొన్నారు.

సిఐటియు నేతల ప్రచారం

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ గెలుపు కోరుతూ సిఐటియు నాయకులు జి.సుబ్బారావు ఆధ్వర్యంలో శనివార షీలానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నెలసరి వేతనాలు, పెన్షన్లు సక్రమంగా అందని పరిస్థితుల్లో, వాటి పరిష్కారానికి పోరాడాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శంకరరెడ్డి, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

అనకాపల్లి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం పట్టణంలో పలుచోట్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు రమాప్రభకు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృతంగా ఈ ప్రచారం సాగింది. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులను ఓట్లు వేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, అది నేటికీ నెరవేరలేదని గుర్తు చేశారు. సిపిఎస్ రద్దు హామీ గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ యూనియన్ నాయకులు నందీశ్వరరావు, అప్పారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు : పిడిఎఫ్. అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ మండలంలోని పాతవలస గ్రామంలో శనివారం ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, నాయకులు వనుము సూర్యనారాయణ, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో రమాప్రభకు 250 ప్రజా సంఘాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బిజెపి ప్రైవేటుపరం చేస్తుండగా, వైసిపి ప్రభుత్వం నోరెత్తలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ శాసనమండలిలో గళం విప్పి ప్రశ్నించగలిగే సత్తా ఉన్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు.

చోడవరంలో...

చోడవరం : డాక్టర్ కోరేడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లోనూ, చోడవరం పట్టణంలోనూ ఎమ్మెల్సీ ఓటర్ల ఇళ్లకు వెళ్లి విజ్ఞప్తి చేశారు. పోరాటాలకు వెన్నుదన్నుగా నిలబడే కోరెడ్ల ప్రమాప్రభ విజయం ఈ ప్రాంత ప్రజలకు ఎంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్వి నాయుడు, ప్రజా సంఘాల నాయకులు శ్రీను, గణేష్, ఆది, సన్నిబాబు, ప్రవీణ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో...

దుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బి పోతురాజు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను శాసనమండలిలో వినిపించే రమాప్రభను గెలిపించాలని కోరారు. పట్టభద్రులైన విద్యావంతులు ఆలోచించి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో రైతుసంఘం నేతల ప్రచారం

చోడవరంలో సిఐటియు, ప్రజాసంఘాల నేతల ప్రచారం

అనకాపల్లిలో ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

దుంబ్రిగుడలో సిఐటియు నేతల ప్రచారం

విశాఖ కేంద్రంగా మత్తు పదార్థాల రవాణా

ఇతర రాష్ట్రాలకు నగరం మీదుగా 71.3 శాతం సరఫరా

పెరుగుతున్న డ్రగ్ పెడ్లర్ల సంఖ్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మెట్రో పాలిటన్ నగరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం కేంద్రంగా డ్రగ్స్, గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతున్న మాదక ద్రవ్యాల్లో విశాఖ నుంచి 70 శాతానికిపైగా ఉన్నట్టు ఓ అంచనా. పోలీసులు, అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ రవాణాదారులు కొత్త కొత్త పంథాల్లో తమపని తాము చేసుకుపోతున్నారు. మరోపక్క నగర యువత అధిక సంఖ్యలో మత్తుకు బానిసలు అవుతున్నారు. విశాఖ నగరంలో పాన్ షాపుల్లో సైతం గంజాయి అమ్మకాలు కొనసాగుతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశం. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసుల దాడులు ఇలా..

అధికారుల గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో సిటీ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సంయుక్తంగా 388 కేసుల్లో 6459 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. గంజాయిని రవాణా చేస్తున్న 852 మందిని అరెస్టు చేశారు. ఈ గంజాయి రవాణాకు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రధాన కేంద్రంగా ఉంది. అక్కడ నుంచి విశాఖ నగరం మీదుగా రవాణా అవుతున్న గంజాయినే 77 కేసుల్లో 4604 కిలోలుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న 6459 కిలోల గంజాయిలో 71.3 శాతం విశాఖపట్నం కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేయబడుతోందని, స్వాధీనం చేసుకున్న మొత్తం 6459 కిలోల గంజాయిలో 71.3 శాతం ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్. ఢిల్లీ. బీహార్. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తెలంగాణలకు రవాణా అవుతోందని అధికారులు గుర్తించారు. మరోపక్క సిటీ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 247 మంది ఇతర రాష్ట్ర డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 5131 పెంటాజోసిన్ ఇంజెక్షన్ 1పిలను స్వాధీనం చేసుకున్నారు.

11.114 సేడెక్టివ్ మాత్రలు, 85 ఎల్ఎసిడి బ్లాట్‌లు, 2 కిలోల నల్లమందు, 126.2 గ్రాముల ఎండిఎంఎ మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితున్ని పశ్చిమ బంగాలో అరెస్టు చేశారు.

నివారణ చర్యలు

నగరంలోని పోలీసు యంత్రాగం మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నివారించేందుకు ప్రభుత్వ స్థలాలు, విద్యా సంస్థల వద్ద 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, ముఖ్యమైన ప్రదేశాలు కలుపుకుని 176 పోస్టర్లు అతికించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద 56 చోట్ల బేనర్లు ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయాలతో పాటు పలు విద్యాసంస్థల్లో 252 అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగం - అనర్థాలపై అవగాహన కల్పించారు. సుప్రా వాహనంతో ఆడియో, వీడియో విజువల్స్ ప్లే చేయడం ద్వారా జిల్లా అంతటా ప్రచారం చేస్తున్నారు. విశాఖ నగరంలో 202 మంది డ్రగ్ వినియోగదారులను తొలి దశలో గుర్తించి కెజిహెచ్‌లో ఉన్న డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సింథటిక్ డ్రగ్ కేసుల్లో నగరంలో 85 మంది డ్రగ్స్ అండ్ యూజర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.

పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణ ఆపండి

పోర్టు గేటు వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తూ షిప్పింగ్ సెక్రటరీ ప్రకటన చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. షిప్పింగ్ సెక్రటరీ శనివారం విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సందర్భంగా పోర్టు గేటు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇదివరకూ షిప్పింగ్ సెక్రటరీ పర్యటనకు వచ్చిన రెండు సార్లూ నాలుగు పోర్టు బెర్తులను ప్రైవేటీకరణ చేశారన్నారు. ఐఒసిని అదానీ పోర్టుకు అప్పజెప్పడం తాజా పర్యటన ముఖ్య ఉద్దేశంగా ఉందన్నారు. పోర్టు ఆస్తులైన బెర్తులు, హాస్పిటల్, పోర్టు కళావాణి, కల్యాణ మండపం తదితర వాటికి టెండర్లు పిలిచినా ఎవరూ రాకపోవడంతో ఎలా అయినా పోర్టు ఆస్తులను ప్రైవేటీకరణ చేయాలని సర్వే చేయడానికి షిప్పింగ్ సెక్రటరీ వచ్చారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే ఏ రకంగా పర్యటనకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా షిప్పింగ్ సెక్రటరీ పోర్టు ఆస్తులు, బెర్తులు, హాస్పటల్, కల్యాణ మండపాలను ప్రైవేటీకరణ చేయడం లేదని, ఐఒసిని అదానీ గంగవరం పోర్టుకు ఇవ్వబోమని ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో మిగతా కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం తరహా ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి నిరసనలూ తెలపకుండా గొంతు నొక్కే పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. విశాఖ పోర్టు ఆదాయం తగ్గించి, అదానీ ఆదాయాన్ని పెంచడానికి గంగవరం పోర్టుకు ఇండియన్ ఆయిల్ కంపెనీ టెండర్లు ఇవ్వడానికి చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు, లక్ష్మణరావు, జక్కన్న, సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఎల్లారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వచ్చే నెల 16న నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లూ జరగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లను, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమయంలో చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీతమ్మధార తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

పోరాటాలతోనే పాత పెన్షన్ సాధించుకోగలం

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోరాటాలతోనే పాత పెన్షన్‌ను సాధించుకోగలమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'పెన్షన్ ఉద్యోగుల జన్మహక్కు - దీనిని కాపాడుకోవడం ఎలా?' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి 30 - 40 ఏళ్ల పాటు ప్రజలకు అనేక రకాలుగా సేవలందిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగి జీవితాంతం, జీవించడం కోసం ఏనాటి నుంచో పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇది రాజ్యాంగ ప్రకారం సంక్రమించిన హక్కు అని తెలిపారు. పెన్షన్ చెల్లించడం ప్రభుత్వానికి భారం కాదన్నారు. దాన్ని ఒక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. పెన్షన్ హక్కును కాలరాసే విధంగా నూతన పెన్షన్ విధానం అంటూ ఉద్యోగులను మోసగించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడటం శోచనీయమన్నారు. బ్యాంకుల నుంచి లక్షలాది కోట్ల రూపాయల రుణాలు పొంది ఎగవేస్తున్న వారి రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ భారం కాదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాన్ని వ్యతిరేకిస్తూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులూ ఐక్యంగా పోరాటం చేయకతప్పదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదు.. రాజ్యాంగ హక్కు అని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పెన్షన్ లేదనడం సరికాదన్నారు. నూతన పెన్షన్ విధానం.. ఒక బూటకం అన్నారు. రాష్ట్రంలో జిపిఎస్ పేరుతో తీసుకువచ్చే పెన్షన్ విధానం ఉద్యోగులందరినీ మోసగించేదేనని అన్నారు. శాసన మండలికి తాను ఎన్నికైతే ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానం అమలు కోసం పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు, ఐక్యవేదిక కన్వీనర్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్పు అయితే, ఎమ్మెల్యేలు, ఎంపీలకు పాత పెన్షన్ విధానాన్ని ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. 40 ఏళ్ల పాటు పనిచేసే ఉద్యోగులకు లేని ఇటువంటి హక్కు, ఐదేళ్ల పదవి కోసం ఎంపికయ్యే ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఎందుకని అడిగారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించడం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో ఐక్య వేదిక ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం విజయవాడలో ఓ సదస్సు జరుగుతుందని, మార్చి 26న విశాఖపట్నంలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు గణేష్, ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.